క్లుప్తంగా

రంగనాథుడి దేవస్థానంలో పూజలు



నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాల్లో భాగంగా నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. ఉభయదేవేరులతో రంగనాథుడు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా చంద్రశేఖరశర్మ, మాధవీలత దంపతులు వ్యవహరించారు. ఉత్తర ద్వారంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా ఈ నెల 11 వరకు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

కిల్‌కారి ఆరోగ్య సేవలపై అవగాహన



మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కిల్‌కారి ఆరోగ్య సేవలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బంది అవగాహన పెంచుకొని క్షేత్రస్థాయిలో తల్లులు, శిశువులకు మంచి సేవలందించాలని డీపీఎంఓ రమేష్ పేర్కొన్నారు. యాకోబ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కిల్‌కారి సేవల కోసం గర్భిణులు, తల్లులకు 0124 – 458800 నంబర్ ద్వారా వాయిస్ మెసేజ్‌ను పంపుతారని చెప్పారు. పుట్టిన పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, తల్లీబిడ్డ క్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై వాట్సాప్ మెసేజ్ ద్వారా వివరిస్తారని తెలిపారు. 14423 నంబర్‌కు రిక్వెస్ట్ పెడితే ఆరోగ్య సేవలపై సమాచారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.

బలిజల ఉన్నతికి కృషి

నెల్లూరు(వేదాయపాళెం): బలిజ కులస్తుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (అప్టా) అధ్యక్షుడు ఉదయ్‌భాస్కర్ పేర్కొన్నారు. అమెరికా నుంచి నెల్లూరొచ్చిన సందర్భంగా ఉదయ్‌భాస్కర్, కుసుమ దంపతులను జిల్లాలోని పలువురు బలిజ సంఘ నేతలు, ఉద్యోగులు ఇరుగాళమ్మ గుడి సమీపంలోని కాపు భవన్‌లో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొంగూరు నారాయణ, జేడీ లక్ష్మీనారాయణ తన సహ విద్యార్థులేనని గుర్తుచేసుకున్నారు. అమెరికాకు వచ్చే బలిజ విద్యార్థులకు అసోసియేషన్ పరంగా స్కాలర్‌షిప్‌లు ఇవ్వడమే కాకుండా కెరీర్ పరంగా సాయమందిస్తానని చెప్పారు. నేతలు ఆదినారాయణ, రాఘవయ్య, సురేష్, విశ్రాంత ఫారెస్ట్ అధికారి ప్రభాకర్‌రావు, రాజేశ్వరి, కిశోర్, సాయిసునీల్, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

పొదలకూరు : ఈనెల 6, 7, 8వ తేదీల్లో కాకాణి రమణారెడ్డి స్మారకార్థం వినాయక షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో పొదలకూరులో ఐదు జిల్లాల ఓపెన్ కేటగిరి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, కడప, అన్నమయ్య జిల్లాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నుడా చైర్మన్, రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఓపెన్ కేటగిరిలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు అందజేస్తామన్నారు. 40 ప్లస్ విభాగంలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, 50 ప్లస్ విభాగంలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 94401 96425 నంబర్‌కు సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఆర్డీఓ విచారణ

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని మినగల్లు గ్రామంలో వివాదాస్పదంగా ఉన్న భూమికి సంబంధించి నెల్లూరు ఆర్డీఓ మలోల మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి తన భూమి రీ సర్వేలో మరొకరి పేరుపై నమోదైనట్లు జేసీకి ఫిర్యాదు చేశారని ఆర్డీఓ తెలిపారు. ఈ మేరకు జేసీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. రీ సర్వే రికార్డులను పరిశీలించడంతో పాటు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమీల ఉన్నారు.

ఆర్నెలల్లో మైపాడు రోడ్డు పనులు పూర్తి



స్థానికులను పలకరిస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మైపాడు రోడ్డు పనులను ఆర్నెలల్లో పూర్తి చేస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నాలుగో డివిజన్లోని శ్రీరామ్‌నగర్, శ్రీనివాసనగర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఇంటింటికీ వెళ్లి వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 3, 4, 5వ డివిజన్లకు సంబంధించిన ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య ఏళ్లుగా ఉందని, ఈ క్రమంలో మైపాడు రోడ్డును నాలుగు వరుసల రహదారిగా విస్తరించేందుకు పనులను చేపట్టామని పేర్కొన్నారు. నిర్మాణానికి ప్రజలు సహకరించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని ఆలయాన్ని తొలగించామని కొందరు ఆరోపించడం తగదని హితవు పలికారు. ప్రహరీని మాత్రమే తొలగించామని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో ఏ అభివృద్ధి పనులు చేశాను.. నాడెలా ఉంది.. నేడెలా ఉందనే అంశాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమాన్ని జూన్ నాటికి నిర్వహించనున్నామని వెల్లడించారు. కార్పొరేటర్ లక్ష్మీప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

తిక్కన పార్కు ప్రారంభం

నెల్లూరు(బృందావనం): నగరంలోని 52వ డివిజన్లో గల పెన్నా బ్యారేజీ వద్ద సుమారు రూ.కోటితో పునర్నిర్మించిన తిక్కన పార్కును నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం గొబ్బెమ్మలు, పెద్దల పండగ ఏర్పాట్లపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్కుతో పాటు మహాకవి తిక్కన ఆశీనులైన గదిని అభివృద్ధి చేశామని తెలిపారు. పార్కును యోగా, వాకింగ్ కోసం ఉపయోగించుకోవచ్చన్నారు. పార్కు బాధ్యతలను అసోసియేషన్‌కు అప్పగించి జాగ్రత్తగా చూసుకునేలా చర్యలు చేపడతామని వివరించారు. గత ప్రభుత్వం నాలుగు పార్కులనే అభివృద్ధి చేసిందని, తమ ప్రభుత్వ హయాంలో 25 మేర అభివృద్ధి చేశామని వెల్లడించారు. పెద్దల పండగ, తెప్పోత్సవం, గొబ్బెమ్మల పండగలకు సంబంధించిన ఏర్పాట్లలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. తెప్పోత్సవం జరిగే ప్రాంతంలో రోడ్డు పనులు చేస్తున్నారని, అయినా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని తెలిపారు. పెద్దల పండగ సందర్భంగా బోడిగాడితోటను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

బ్యారేజీ పూర్తయ్యాక అద్భుతంగా ప్రాంతం

పెన్నా బ్యారేజీ పూర్తయ్యాక ఈ ప్రాంతం అద్భుతంగా మారిందని ఎమ్మెల్యే తెలిపారు. ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా బుచ్చిరెడ్డిపాళెం, కోవూరుకు రాకపోకలను సాగించేందుకు అనువుగా మారిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జిల్లాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ముందుకెళ్తున్నామని వివరించారు. జిల్లాలో పార్టీ ఎంతో పటిష్టంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో అన్ని సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు అస్మా, జయలక్ష్మి, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి



పూలే దంపతుల విగ్రహాలకు నివాళులు



నివాళులర్పిస్తున్న బీఎస్పీ నేతలు



డీకేడబ్ల్యూ కళాశాలలో..



వెంకటేశ్వరపురంలోని పాఠశాలలో..



బీసీ యువజన సంఘ కార్యాలయంలో..

నెల్లూరు(వేదాయపాళెం): తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని బీసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మినీబైపాస్ రోడ్డులోని పూలే దంపతుల విగ్రహాలకు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు.

• బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి శ్రీరామ్, రాజా, జయరామ్ తదితరులు నివాళులర్పించారు.

• బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, పద్మజాయాదవ్, విజయమ్మ, తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

• వీఆర్సీ సెంటర్‌లోని బీసీ యువజన సంఘ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణయాదవ్ నివాళులర్పించారు. బీసీ యువజన విభాగ అధ్యక్షుడు మోహన్‌కృష్ణ, అబ్దుల్ కలామ్, తదితరులు పాల్గొన్నారు.

• విక్రమ్‌నగర్‌లోని బీసీ విద్యార్థి సంఘ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శంకరయ్య నివాళులర్పించారు. నేతలు రాజశేఖర్, దయాకర్, పెద్దిరాజు, యాదవరాజు, రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని రామరాజు చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శశికాంత్‌రెడ్డి, ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీరామరాజు, నందకృష్ణాచారి, కిరణ్, కిషోర్, మహేష్, రాజనరేంద్ర, వినీత్, మురళీమోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు మంజుల వాణిని సత్కరించారు. ఉపాధ్యాయులు రాజమనోహర్, శారద, పద్మావతి, లక్ష్మి, లక్ష్మీప్రసన్న, రమణయ్య, ఖాజారహంతుల్లా,, ధనరాజ్, లక్ష్మయ్య, శైలజ, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, ఆదిశంకర కళాశాల మాజీ ప్రిన్సిపల్ సరితాకుమారి, ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు ఫాతిమున్నీసా, శ్రావణ్‌కుమార్, చెంచు రామయ్య, జోజీ, రమణారెడ్డి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

• కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సంధ్యారాణి, మాధవి, వినీత, రాశిని సత్కరించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ ఆఫీసర్ మహేంద్రరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

• జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో బీటీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు, ఏడీ గ్లోరీ కుమారి, ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓ తిరుపాల్ హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు గౌసియా, దీప్తి, ఇందిరా, సౌజన్య, సునీత, శిరీషా, శాంతిహిత, మంజుల, పర్వీన్, ప్రశాంతి, తదితరులను సత్కరించారు. బీటీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, రాష్ట్ర ఆడిట్ సెక్రటరీ మాల్యాద్రి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు భాస్కరయ్య, రమేష్‌బాబు, బీటీఏ నగరాధ్యక్షుడు ఖాజారహంతుల్లా, ప్రధాన కార్యదర్శి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

• మినీబైపాస్‌లోని సావిత్రీబాయి పూలే విగ్రహానికి మహిళా టీచర్స్ అసోసియేషన్ నేతలు నివాళులర్పించారు. ఎంటీఏ స్టేట్ ప్రెసిడెంట్ సరస్వతి పద్మజ, జనరల్ సెక్రటరీ సుధావాణి, జిల్లా అధ్యక్షులు హుస్నారా, గౌరవ సలహాదారు జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదుకు డిమాండ్



బాధితుడ్ని పరామర్శిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): దగదర్తి మండలం ఉలవపాళ్లకు చెందిన దళిత యువకుడు తేజపై దాడికి పాల్పడిన స్థానిక నేత మహేష్‌నాయుడిపై హత్యాయత్నం కేసును నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పెంచలయ్య, రఘు డిమాండ్ చేశారు.

పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడ్ని మంగళవారం వారు పరామర్శించారు. రసూల్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: నగరంలోని 33వ డివిజన్లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూరల్ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అహర్నిశలూ పాటుపడుతున్నారని చెప్పారు. పార్టీ నగరాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ మంజుల, పార్టీ డివిజన్ అధ్యక్షుడు హజరత్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): ఏపీ మెడికల్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ డైరీలను సంతపేటలోని తన చాంబర్‌లో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాధులను గుర్తించడంలో మరింత క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రజలకు సేవలందించాలని కోరారు. ఏడీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్, డీఎంఓ బ్రిజిత, అసోసియేషన్ నేతలు గోపీకృష్ణ, విజయ్, శేఖర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కల్యాణ చక్రవర్తితో భేటీ



నెల్లూరు (టౌన్): ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తిని ఇన్‌చార్జి డీఈఓ సుబ్బారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు

నెల్లూరు(క్రైమ్): పంట కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటన కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. మచిలీపట్నంలోని చిన్నాపురానికి చెందిన రమణ తల్లికి ఇటీవల తిరుపతిలో శస్త్రచికిత్స జరిగింది. దీంతో ఆయన తెనాలికి చెందిన తన బావమరిది భాస్కర్‌రావుతో కలిసి తల్లికి అవసరమైన వస్తువులతో తిరుపతికి కారులో బయల్దేరారు. జాతీయ రహదారిపైకి వచ్చేసరికి రమణ కునుకు తీయడంతో కారు సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లి పంట కాలువలో పడింది. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఎస్సై రంగనాథ్‌గౌడ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో కారును వెలికితీయించారు. కారులోని వారు అందులోనే ఉన్నా, ఎలాంటి గాయాలు కాలేదు. ఫిర్యాదు చేసేందుకు వారు ముందుకు రాకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు.

తటస్థుల దీవెనకు శ్రీకారం



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తటస్థుల దీవెన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 19వ డివిజన్లో తటస్థుల దీవెన కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. 30 రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. పార్టీలకతీతంగా సమస్యలకు పరిష్కారం చూపడమే తన లక్ష్యమని తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలనేదే తన ఉద్దేశమని.. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే తత్వం తనది కాదన్నారు. సమావేశానికి హాజరైన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం వారితో కలిసి ఆత్మీయ విందుకు హాజరయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ జ్యోతిప్రియ, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మదన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..





వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలిస్తున్న హరిత, వెంకటసుబ్బయ్య

నెల్లూరు సిటీ: రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కమిషనర్ హరిత మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను తెలియజేశారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సాహితీ రంగంలో సింహపురి ఖ్యాతి విశ్వవ్యాప్తం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణారెడ్డి, తదితరులు

నెల్లూరు(బృందావనం): సాహితీ రంగంలో జిల్లాకు చెందిన ఎందరో మహానుభావులు అందిస్తున్న సేవలతో సింహపురి ఖ్యాతి నానాటికీ విశ్వవ్యాప్తమవుతోందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. కవి ఈతకోట సుబ్బారావు రచించిన 'విశాల నయనం' సంపాదకీయ కవిత్వ పుస్తకాన్ని గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడారు. సాహిత్య సేవ చేస్తున్న విశాలాక్షి సాహిత్య మాసపత్రిక సంపాదకుడు రత్నానికి ఈ పుస్తకాన్ని అంకితమిస్తున్నానని చెప్పారు. పురుషోత్తం, భాస్కర్‌రెడ్డి, శివకుమార్, కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, అమీర్‌జాన్, భాస్కర్, హరనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



నెల్లూరు రూరల్: నెహ్రూ యువ కేంద్రం, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మేయర్ స్రవంతి మంగళవారం ప్రారంభించారు. పార్టీ నగరాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్ర అధికారి మహేంద్రరెడ్డి, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రసూల్, వసుజ్యోతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు వసుంధర, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రాజేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ సీఎండీకి శుభాకాంక్షలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలను వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు తెలియజేశారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖ క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(సెంట్రల్): రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ క్యాలెండర్లను కలెక్టర్ చక్రధర్‌బాబు తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఆ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ హరివర్మ, తదితరులు పాల్గొన్నారు

ఫ్లెక్సీల విషయమై ఘర్షణ

నెల్లూరు(క్రైమ్): ఫ్లెక్సీల విషయమై ఇరువర్గాల నడుమ ఘర్షణ చెలరేగి పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటకు చెందిన మాల్యాద్రి, ప్రసాద్ అన్నదమ్ములు. ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో వీరి అనుచరుల నడుమ ఇటీవల విభేదాలు నెలకొన్నాయి. దీంతో ఇరువర్గాలు సోమవారం అర్ధరాత్రి దాడులు చేసుకున్నాయి. ఘటనలో ప్రసాద్‌తో పాటు అతని అనుచరులు వెంకటేశ్వర్లు, శ్యామ్, మరో ఇద్దరు గాయపడ్డారు. మరో వర్గానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి, మాల్యాద్రి కుమారుడు కార్తీక్‌కు గాయాలయ్యాయి. పోలీసులు విచారణ జరుపుతున్నారు.